క్లుప్తంగా

ఘనంగా సాయిబాబా ఆలయ వార్షికోత్సవం



చినగదిలిలోని నార్త్ షిర్డీ సాయిబాబా

ఆరిలోవ : జీవీఎంసీ 12వ వార్డు పరిధి చినగదిలి నార్త్ షిర్డీ సాయిబాబా ఆలయ వార్షికోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజులపాటు నిర్వహించనున్న ఉత్సవాల కోసం నిర్వాహకులు ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఉత్సవాల సందర్భంగా మంగళవారం ఉదయం 6 గంటల నుంచి స్వామికి పూజలు చేశారు. అనంతరం నూతన వస్త్రాలు, పూలమాలలతో అలంకరించారు. స్వామి సన్నిధిలో సామూహిక సాయి సత్యవ్రతాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తుల పాల్గొన్నారు.

శశిధర్‌కు మహా స్వర్ణ నంది పురస్కారం



అవార్డు అందుకుంటున్న శశిధర్

బీచ్‌రోడ్డు: జీఆర్‌డీ ఫ్యాషన్స్ డైరెక్టర్ శశిధర్ పైడిరాజు పంద్రాడ జాతీయ మహా స్వర్ణ నంది అవార్డును అందుకున్నారు. ఫ్యాషన్ రంగంలో విశేష సేవలందించినందుకు గాను శ్రీ లంబోదర కల్చరల్ అకాడమీ, ఎస్‌కేఎస్ అకాడమీ సంయుక్తంగా ఈ అవార్డును అందించాయి. నగరంలో శివానందలహరి పేరుతో నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవంలో ముఖ్య అతిథులు రాజన్న సిరిసిల్ల జిల్లా వాస్తవ్యులు నాట్య విజ్ఞాన్ డాక్టర్ కళా అశోక్ నక్క, సినీ నటుడు సుమన్ పాల్గొని ఈ అవార్డును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు అభినందించారు.

చోరీకి పాల్పడిన ఇద్దరు యువకుల అరెస్ట్

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీ అప్పుఘర్ కూడలి వద్ద చోరీకి పాల్పడిన ఇద్దరు యువకులను ఎంవీపీ కాలనీ నేరవిభాగం పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ ఘటనపై పోలీసులు తెలిపిన వివరాలివి.. ఆదివారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో షేక్ షహీదుల్లా అనే వ్యక్తి అప్పుఘర్ కూడలి దరి టూరిజం హోటల్ పార్కింగ్ వద్ద నిలబడి ఉండగా, అదే ప్రాంతానికి చెందిన పేర్ల రఘు (19), నీలు నవదీప్ అలియాస్ నాని (20) వచ్చి అతనిపై దౌర్జన్యం చేసి, అతని వద్ద నుంచి రూ.2 వేలు నగదు దోచుకొని పరారయ్యారు. ఈ ఘటనపై షహీదుల్లా పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎంవీపీ క్రైం ఎస్‌ఐతో పాటు సిబ్బంది ఆ ప్రాంతంలోని సీసీ పుటేజీలను పరిశీలించి, నేరస్తులను గుర్తించారు. మంగళవారం వారిద్దరినీ అరెస్ట్ చేసి, వారి నుంచి రూ.1200 స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బూత్‌స్థాయి కమిటీలను బలోపేతం చేయాలి

ఎంవీపీకాలనీ: విశాఖలోని అన్ని మండలాల్లో బూత్‌స్థాయి కమిటీలను బలోపేతం చేయాలని బీజేపీ రాష్ట్ర సంఘటన్ కార్యదర్శి ఎస్.మధుకర్ పిలుపునిచ్చారు. లాసన్స్ బే కాలనీలోని బీజేపీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన పార్టీ సంస్థాగత సమావేశంలో ఆయన పాల్గొన్నారు. విశాఖలో పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. పార్టీ బలోపేతానికి జిల్లా నుంచి వార్డు నాయకుల వరకు అందరూ క్రియాశీలకపాత్ర పోషించాలని సూచించారు. సమావేశంలో విశాఖ ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు, పార్టీ జిల్లా అధ్యక్షుడు పరశురామరాజు, మాజీ ఎమ్మెల్సీ మాధవ్, రాష్ట్ర కోశాధికారి నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్‌లో నేటి నుంచి ఉచిత శిక్షణ

మురళీనగర్ : కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో బుధవారం నుంచి నాలుగు రోజులపాటు ఫార్మాసిస్టులకు ఉచిత శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నారాయణరావు తెలిపారు. ఫార్మాసిస్టులు తమ నైపుణ్యాలను మెరుగు పరచుకునేందుకు భారత ప్రభుత్వ లైఫ్ సైన్సెస్‌లోని నైపుణ్యాభివృద్ధి కౌన్సిల్ ఆధ్వర్యంలో ''ఫార్మకోవిజిలెన్స్ కేస్ ప్రాసెసింగ్'' అనే అంశంపై ఉచితంగా శిక్షణ ఇస్తామన్నారు. ఈ శిక్షణ తరగతులకు 40 మంది రిజిస్టర్డ్ ఫార్మాసిస్టులు హాజరవుతారని చెప్పారు.


ప్రజాధనం వృథా

ముడసర్లోవ వద్ద పాత స్కిల్ డెవలప్‌మెంట్ భవనం





అస్తవ్యస్తంగా మారిన భవనం లోపలి గది



శిథిలమైన గచ్చు.. తలుపులు లేని వెనుక ద్వారం



అద్దాలు పగిలిపోయిన భవనం వెనుక భాగం

ఆరిలోవ : అధికారుల ప్రణాళిక లోపంతో కోట్లాది రూపాయల ప్రజాధనం వృథా అవుతోంది. జీవీఎంసీ అధికారులు ముడసర్లోవలో కోట్ల రూపాయలు ఖర్చు చేసి నిర్మించిన భారీ భవనాన్ని ప్రస్తుతం వినియోగించకుండా నిరుపయోగంగా వదిలేశారు. ఫలితంగా ఆ భవనం అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది. ఆరిలోవ ప్రాంతం ముడసర్లోవ వద్ద జీవీఎంసీ సుమారు 11 సంవత్సరాల క్రితం ఓ భవనం నిర్మించింది. ఇక్కడ బీఆర్‌టీఎస్ పక్కన పచ్చని మామిడి, కొబ్బరి చెట్లుతో ఉండే జీవీఎంసీకి చెందిన 2 ఎకరాల స్థలంలో 2011లో జీవీఎంసీ అధికారులు జోనల్ కార్యాలయం నిర్మాణం చేపట్టారు. దీని కోసం రూ.6 కోట్లు నిధులు కేటాయించి ఆగమేఘాలపై పనులు జరిపారు. 2013 నాటికి భవన నిర్మాణం పూర్తి చేశారు. మూడు అంతస్తుల్లో విశాలమైన గదులతో మంచి గాలి, వెలుతురు వచ్చేటట్లు నిర్మించారు. అధికారులు ఈ భవనంలోకి మధురవాడలో ఉన్న జీవీఎంసీ జోన్ – 2 కార్యాలయాన్ని తరలించడానికి సన్నాహాలు చేశారు. అప్పట్లో ఆ ప్రాంత ప్రజాప్రతినిధులు అడ్డుకోవడంతో జీవీఎంసీ అధికారులు ఆ ప్రయత్నం విరమించుకున్నారు. దీంతో 2014లో కొద్ది నెలలు దీని ఆవరణను ప్రభుత్వ ఇసుకయార్డుగా మార్చేశారు. అనంతరం 2015లో హెచ్‌పీసీఎల్ యాజమాన్యానికి స్కిల్ డవలెప్‌మెంట్ సెంటర్ నిర్వహణకు లీజుకు ఇచ్చేశారు. దీని ద్వారా నెలకు రూ.15 లక్షలు జీవీఎంసీకి హెచ్‌పీసీఎల్ అద్దె చెల్లించేది. రెండు ఎకరాల స్థలంలో రూ.6 కోట్లతో నిర్మించిన భారీ భవనాన్ని ప్రభుత్వ కార్యాలాపాలకు కాకుండా అద్దెకు ఇవ్వడంపై అప్పట్లో ప్రజల నుంచి విమర్శలు వెల్లువెత్తాయి. లీజు గడువు ముగిసిన తర్వాత హెచ్‌సీపీఎల్ యాజమాన్యం ఆ భవనాన్ని 2023 నవంబరులో ఖాళీ చేసి జీవీఎంసీ అధికారులకు అప్పిగించేసింది. అప్పటి నుంచి ఖాళీగా వదిలేయడంతో అసాంఘిక శక్తులకు అడ్డాగా మారింది.

భవనమంతా అస్తవ్యస్తం

రూ.ఆరు కోట్లతో నిర్మాణం చేపట్టిన పదేళ్లలోనే ఈ భవనం శిథిలావస్థలకు చేరింది. గోడలు పెచ్చులు ఊడిపోయాయి. కిటికీల అద్దాలు పగిలిపోయాయి. వర్షాలు కురుస్తున్నప్పుడు శ్లాబు నుంచి గోడల ద్వారా నీరు గదుల్లోకి చేరి నిలిచిపోతోంది. గోడల పెచ్చులు, గచ్చులు ఊడిపోయి భవనమంతా అస్తవ్యస్తంగా మారిపోయింది. విశాలమైన గదులలో కిటికీల అద్దాలు పగిలిపోయాయి. దీంతో గదులలో కాలు మోపలేని పరిస్థితి నెలకొంది. పదేళ్లకే హెచ్‌పీసీఎల్ యాజమాన్యం భవనాన్ని శిథిలావస్థకు చేర్చి జీవీఎంసీకి అప్పగించింది. అంతటి అస్తవ్యస్తంగా ఉన్న భవనాన్ని అధికారులు ఎలా తిరిగి స్వాధీనం చేసుకున్నారంటూ స్థానికుల నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి. భవనం వినియోగానికి పనికొచ్చేలా మరమ్మతులు చేపట్టి అప్పగించాల్సిన బాధ్యత హెచ్‌పీసీఎల్ యాజమాన్యానికి ఉన్నప్పటికీ వారిపై జీవీఎంసీ అధికారులు ఎలాంటి ఒత్తిడి చేయలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఆరు నెలల క్రితం ఈ భవనాన్ని సందర్శించిన అప్పటి జీవీఎంసీ కమిషనర్ సంపత్ కుమార్ దీని పరిస్థితిని పరిశీలించి అవాక్కయ్యారు. రూ.కోట్లు నిధులు ఖర్చుచేసి నిర్మించిన ఈ భవనాన్ని నిర్లక్ష్యంగా వదిలేశారంటూ ఇంజినీరింగ్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. హెచ్‌పీసీఎల్ యాజమాన్యానికి లేఖ రాసి వెంటనే మరమ్మతులు చేపట్టేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అయినా ఇంత వరకు ఆ దిశగా కనీస చర్యలు చేపట్టకపోవడం విశేషం. నిరుపయోగంగా ఉన్న ఈ భవనానికి నలుగురు సెక్యూరిటీ సిబ్బందిని నియమించారు. రెండు సిఫ్టులలో ఇద్దరేసి చొప్పున పనిచేస్తున్నారు. వారికి జీవీఎంసీ నెలకు సుమారు రూ.60 వేలు వరకు వేతనాలు చెల్లించాల్సి వస్తోంది.

అసాంఘిక కార్యకలాపాలకు నిలయం

ఈ భవనం స్వాధీనం చేసుకున్న తర్వాత జీవీఎంసీ అధికారులు కనీస మరమ్మతులు చేపట్టకుండా వదిలేశారు. ఏదైనా ప్రభుత్వ కార్యకలాపాలకు కూడా వినియోగించుకోకుండా నిర్లక్ష్యంగా వదిలేశారు. ఇది ఖాళీగా ఉండటం, నివాసాలకు దూరంగా ఉండటంతో అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది. దీని వెనుక మామిడి తోట ఉండటంతో రాత్రి వేళల్లో ఈ ప్రాంతం నిర్మానుష్యంగా మారుతుంది. దీంతో విశాలమైన ఈ భవనంలోకి కొందరు యువకులు గుట్టుగా ప్రవేశిస్తున్నారు. గదులలో గంజాయి, మద్యం తాగడం... తదితర అసాంఘిక కార్యకలాపాలు చేసుకుపోతున్నారు.

ప్రజాధనం దుర్వినియోగం

ఇక్కడి విశాలమైన స్థలంలో మామిడి, కొబ్బరి చెట్లు ఉండేవి. వాటిని తొలగించి జీవీఎంసీ అధికారులు ప్రజాధనం వినియోగించి భవనం నిర్మించారు. ఆ భవనాన్ని ప్రస్తుతం నిరుపయోగంగా వదిలేశారు. ప్రభుత్వ భూమిలో ప్రజాధనంతో నిర్మించిన భవనం వినియోగించకుండా దుర్వినియోగం చేస్తున్నారు. దీన్ని ప్రజల కోసం వినియోగంలోకి తీసుకురావాలి.

– ఆర్.రామకృష్ణారావు, శ్రీకాంత్‌నగర్ కాలనీ, ఆరిలోవ

కార్యాలయాలకు వినియోగించాలి

ఇంత విశాలమైన భవనాన్ని ప్రభుత్వ కార్యాలయాలుగా వినియోగించాలి. మధురవాడలో ఇరుకు భవనంలో జోన్ – 2 కార్యాలయం నిర్వహిస్తున్నారు. ఆ భవనాన్ని ఇక్కడకు తరలిస్తే సేవలు విస్తృతమవుతాయి. కొన్నిచోట్ల అద్దె భవనాలలో ప్రభుత్వ కార్యాలయాలు నిర్వహిస్తున్నారు. నిరుపయోగంగా ఉన్న ఈ భవనాన్ని వినియోగించుకుంటే మేలు జరుగుతుంది. ఇది ఖాళీగా ఉండటంతో రాత్రి వేళల్లో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయి.

– సీహెచ్.రమణ, పెదగదిలి

పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయకు ఘన నివాళి



దీన్‌దయాళ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

ఎంవీపీకాలనీ: పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ వర్ధంతిని పురస్కరించుకుని బీజేపీ నగర శ్రేణులు ఘనంగా నివాళుర్పించాయి. పార్టీ జిల్లా అధ్యక్షుడు పరశురామరాజు ఆధ్వర్యంలో లాసన్స్ బే కాలనీలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం ఈ కార్యక్రమం జరిగింది. తొలుత పార్టీ శ్రేణులు ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించి, శ్రద్ధాంజలి ఘటించారు. పరశురామరాజు మాట్లాడుతూ దేశసేవనే జీవన విధానంగా మార్చుకున్న మహోన్నత వ్యక్తి దీనదయాళ్ ఉపాధ్యాయ అన్నారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా పార్టీ సేవలను కొనసాగించాలని పార్టీ శ్రేణులకు సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర సంఘటన్ ప్రధాన కార్యదర్శి మధుకర్, రాష్ట్ర ప్రధానకార్యదర్శి తపనా చౌదరి, పార్టీ రాష్ట్ర కోశాధికారి నాగేంద్ర, పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఆరోగ్య కార్యక్రమాలపై పీఆర్‌సీ బృందం సమీక్ష



డీఎంహెచ్‌వో కార్యాలయంలో సమీక్ష నిర్వహిస్తున్న కేంద్ర పీఆర్‌సీ బృంద సభ్యులు

మహారాణిపేట: ఆరోగ్య కార్యక్రమాల అమలుపై పర్యవేక్షణకు ఢిల్లీ నుంచి వచ్చిన పాపులేషన్ రీసెర్చ్ సెంటర్(పీఆర్‌సీ) కేంద్ర బృందం విశాఖ చేరుకుంది. ఈ బృందంలో సభ్యులు డాక్టర్ పాదాలు, రమణ 5 రోజులు పాటు విశాఖలో క్షేత్ర స్థాయిలో పర్యటిస్తున్నారు. అందులో భాగంగా మంగళవారం రేసవానిపాలెం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి, ఆరోగ్య కార్యక్రమాలను డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు బృంద సభ్యులకు వివరించారు. మధ్యాహ్నం కంచరపాలెం, దొండపర్తి తదితర ప్రాంతాల్లో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సందర్శించారు. క్షేత్ర స్థాయి సిబ్బంది, కార్యాలయ సిబ్బంది హాజరు పరిశీలించి తగు సూచనలు చేశారు. సమావేశానికి జిల్లా ప్రోగ్రాం అధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సాంకేతికతను సద్వినియోగం చేసుకోవాలి



సదస్సు ప్రారంభిస్తున్న జితేంద్ర శర్మ

విశాఖ విద్య: సాంకేతికతను సద్వినియోగం చేసుకుని పరిశ్రమలను అభివృద్ధి చేసుకోవాలని ఏఎంటీజెడ్ ఎండీ జితేంద్ర శర్మ అన్నారు. ఆంధ్ర యూనివర్సిటీ ప్రాంగణంలోని ఐఐపీఈలో మంగళవారం జరిగిన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అధునాతన శాస్త్రీయ పరికరాలను కోరుకునే పరిశోధకులు లేదా పరిశ్రమ సభ్యులు తమకు అవసరమైన పరికరాల కోసమని అనువైన సంస్థతో భాగస్వామ్యం కావటం ద్వారా అభివృద్ధి దిశగా ముందుకు సాగవచ్చన్నారు. ఇలాంటి సదస్సులు వివిధ పరిశ్రమల నిర్వాహకులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయన్నారు. ఈ సందర్భంగా వివిధ నమూనాలను ప్రదర్శించారు. విశాఖ ఫార్మాసిటీ లిమిటెడ్ ఎండీ డాక్టర్ లాల్ కృష్ణ, ఐఐపీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ శాలివాహన్, డీన్ ఆచార్య విజయ మోహన్, రిజిస్ట్రార్ రాంగోపాల్ ద్వివేది తదితరులు ప్రసంగించారు. సదస్సులో వివిధ విశ్వవిద్యాలయాలు, కళాశాలల నుంచి అధ్యాపకులు, పరిశోధన స్కాలర్లు పాల్గొన్నారు.

రోడ్డు ఇలా.. రాకపోకలెలా?



ఆదర్శనగర్ మొదటి లేన్‌లో ..

ఆరిలోవ: జీవీఎంసీ పదో వార్డు పరిధి ఆదర్శనగర్‌లో పలు రోడ్లు శిథిలమయ్యాయి. కొన్ని చోట్ల రాళ్లు పైకి తేలిపోగా.. మరికొన్నిచోట్ల రోడ్ల మధ్యలో గోతులు పడ్డాయి. కొన్ని ప్రాంతాల్లో మ్యాన్‌హోల్స్ మూతలే ప్రమాదకరంగా మారాయి. ఆదర్శనగర్ ఒకటో లేన్‌లో ఇందిరానగర్ ప్రాథమిక పాఠశాల, పాత డెయిరీఫారం పోస్టాఫీస్‌కు వెళ్లే రహదారిలో ఒకేచోట ఐదు మ్యాన్ హోల్స్ ఉన్నాయి. వాటిపై ఓ మ్యాన్ హోల్ ఇనుప మూత పైకి లేచిపోయింది. మరో రెండు రోడ్డుకు లోతులో ఉన్నాయి. దీంతో ఇక్కడ వాహనచోదకులకు ఇబ్బందిగా మారింది. దీంతో పాటు ఇక్కడ షిర్డీ సాయిబాబా ఆలయం సమీపంలో రోడ్డు, శివాలయం వీధిలో రోడ్లు గోతులు పడ్డాయి. ఈ ప్రాంతంలో రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం



అవగాహన కల్పిస్తున్న ఆర్టీసీ ఆర్‌ఎం అప్పలనాయుడు

బీచ్‌రోడ్డు: ఇంటర్నెట్ సేవల వినియోగం పెరుగుతున్న కొద్దీ సైబర్ నేరాలు పెరుగుతున్నాయని ఆర్టీసీ విశాఖ రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు పేర్కొన్నారు. ఓటీపీల విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. సేఫ్ ఇంటర్నెట్ డే సందర్భంగా మద్దిలపాలెం ఆర్టీసీ డిపోలో మంగళవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తెలియని నంబర్ల నుంచి వచ్చే లింకులను ఓపెన్ చేయకూడదని, ఓటీపీలు ఎవరికీ షేర్ చేయకూడదని తెలిపారు. ప్రజలందరూ అప్రమత్తంగా ఉండి ఆర్థిక నేరాలను అరికట్టాలన్నారు. కార్యక్రమంలో విశాఖ డిపో మేనేజర్ గంగాధర్, మద్దిలపాలెం డిపో మేనేజర్ అరుణ కుమారి తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన



దాబాగార్డెన్స్: నగరంలోని బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణ పుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ కార్య నిర్వహణాధికారి కె.శోభారాణి, సహాయ కార్య నిర్వహణాధికారి కె. తిరుమలేశ్వరరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఏయూ టార్గెట్ బాల్ జట్ల ఎంపిక



పురుషుల జట్టుతో వర్సిటీ అధికారులు



మహిళల జట్టుతో ఏయూ అధికారులు

విశాఖ విద్య: ఇంటర్ యూనివర్సిటీ టార్గెట్ బాల్ పోటీల్లో పాల్గొనే ఏయూ పురుషుల, మహిళల జట్లను ఎంపిక చేశారు. ఏయూ గోల్డెన్ జూబ్లీ స్పోర్ట్స్ గ్రౌండ్‌లో ఎంపికైన క్రీడాకారుల జాబితాను వర్సిటీ స్పోర్ట్స్ డైరెక్టర్ ఆచార్య విజయ్ మోహన్ వెల్లడించారు. మహిళల విభాగంలో ఏవీఎన్ కళాశాల, ప్రగతి కళాశాల, గాయత్రి విద్యా పరిషత్ జట్లు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచాయి. పురుషుల విభాగంలో ఏవీఎన్ కళాశాల, ఏయూ ఆర్ట్స్ కాలేజీ జట్లు ఫైనల్స్‌కు చేరుకున్నాయి.

గ్రామీణ ప్రజల జీవనం మెరుగుపడాలి



సదస్సులో మాట్లాడుతున్న ఆచార్య రాజు

విశాఖ విద్య : గ్రామీణ భారతంలో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆంధ్ర విశ్వవిద్యాలయం సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఎం.వి.ఆర్.రాజు అన్నారు. ఏయూ రాజనీతి – ప్రభుత్వ పాలన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'రోల్ అండ్ రిలవెన్స్ ఆఫ్ ది పార్లర్ బాడీస్ ఇన్ రూరల్ లోకల్ గవర్నమెంట్' జాతీయ సదస్సు మంగళవారం ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన సదుపాయాల కల్పన దిశగా కృషి జరగాలని సూచించారు. ఈ ప్రక్రియలో స్థానిక సంస్థలకు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు సంపూర్ణ సహకారం, స్వేచ్ఛ అందించాల్సిన అవసరం ఉందన్నారు. పోషక ఆహార లోపం, అనారోగ్యం, మానసిక సమస్యలు వంటివి గ్రామీణ ప్రాంతాల ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నాయని చెప్పారు. వీటిని పరిష్కరించే దిశగా నిపుణులు, ప్రజాప్రతినిధులు సమిష్టిగా కృషి చేయాలని సూచించారు. సదస్సులో ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఎ.నరసింహారావు, ఆచార్య పి.ప్రేమానందం తదితరులు ప్రసంగించారు. కార్యక్రమంలో రీజినల్ ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ టి.అనిల్ కుమార్, ప్రొఫెసర్ ఎస్సార్ సుభాని, సదస్సు కో డైరెక్టర్ డాక్టర్ టి.నాగరాజు, డాక్టర్ జి.వీర్రాజు, డాక్టర్ వి.హరీష్, డాక్టర్ షేక్ సులేమాన్, డాక్టర్ కె.దేముడు, డాక్టర్ కె.సత్యనారాయణ, డాక్టర్ కె.రత్నరాజు, డాక్టర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. పలువురు విద్యార్థులు తమ పరిశోధన పత్రాలను సమర్పించారు.

ఈ దారి.. పూలదారి



సాగరతీరం నిత్యం కొత్తదనాన్ని తనలో నింపుకొని ఆకట్టుకుంటోంది. విశాఖ నుంచి భీమిలి వెళ్లే మార్గంలో రోడ్డు మధ్య నాటిన కాగితం పూల మొక్కలు ప్రస్తుతం విరబూస్తున్నాయి. చుట్టూ పచ్చని చెట్ల మధ్య విశాలమైన రహదారి ఎంతో సుందరంగా దర్శనమిస్తోంది. ఈ మార్గంలో ప్రయాణించే వారికి ఆహ్లాదాన్ని పంచుతోంది. సముద్రం నుంచి వచ్చే చల్లని గాలులు.. పక్కనే ఉన్న ఆకుపచ్చని కొండలు, రహదారి నిండా పరచుకున్న పచ్చదనం పర్యాటకులకు, నగర వాసులకు అనిర్వచనీయమైన అనుభూతిని అందిస్తోంది. – ఏయూక్యాంపస్

ఫొటో: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం